క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌బాషా

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని పెంచికలపాడు సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై ఆదివారం జరిగింది. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం శ్రీరంగాపురంకు చెందిన హుస్సేన్‌బాషా కంభం వైపునకు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. పెంచికలపాడు సమీపంలోకి రాగానే గేదెలు అడ్డురావడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గిద్దలూరు 108 సిబ్బంది క్షతగాత్రుడిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలోని పొలాల్లో ఆదివారం పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కొమరోలు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై.. తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వెలిగండ్ల మాజీ సర్పంచికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, కుటుంబ సభ్యులు

కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆర్డీవో సరోజినీరెడ్డి భర్త మల్లికార్జునరెడ్డి, కుమార్తె డాక్టర్ శైలజ, కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మునగపాడు సర్పంచ్ పార్లపల్లి సిద్ధానబీ, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షుడిగా గొట్టం మల్లికార్జునరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో ప్రైవేటు పాఠశాలల సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా కె.రంగయ్య, ఉపాధ్యక్షుడిగా పి.నారాయణ, కార్యదర్శిగా పి.ప్రకాషరావు, కోశాధికారిగా పీవీ శ్రీనివాసరావు, న్యాయ సలహాదారునిగా పి.పవన్‌కుమార్, నాగార్జునరెడ్డి, ఈసీ మెంబర్లుగా సురేష్‌బాబు, శివశంకర్‌రెడ్డి, కరీముల్లా, మహేష్‌ను ఎన్నుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని చందవరంలో ఎగ్గోని శ్రీనివాసరెడ్డి వివాహానికి, వద్దిపాడులో పాడతరపు చిన్న కాశయ్య వివాహానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, ఎగ్గోని క్రిష్టారెడ్డి, బండారు రాజు, డి.చెంచిరెడ్డి, పి.మూర్తయ్య పాల్గొన్నారు.

123 మద్యం సీసాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

కంభం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు కంభం ఎస్సై బి.నరసింహారావు తెలిపారు. అర్ధవీడు వెళ్లే దారిలో ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా, రామానాయక్ అనే వ్యక్తి అక్రమంగా 123 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి

ఆస్పత్రుల్లో రోగులకు సేవలందిస్తున్న వైద్యులకు, వైద్యారోగ్య శాఖ సిబ్బందికి రక్షణ కల్పించాలి. లేదంటే విధులను ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించడం కష్టం. రోజూ రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. విపత్తుల సమయంలో సత్వర సాయం అందేలా ప్రత్యేక రక్షణ కల్పించాలి. వైద్యశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించాలి.

– డాక్టర్ ఎస్సీ బాలయ్య, కొనకనమిట్ల పీహెచ్‌సీ





వైద్యులకు భద్రత కల్పించాలి

వైద్యులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, హత్యాచారాలకు పాల్పడటం సరైన పద్ధతి కాదు. వైద్యం కోసం వచ్చే రోగుల బంధువుల మానసిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంటోంది. వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించే వైద్యులకు ప్రతిఒక్కరూ రక్షణగా నిలబడాలి.

– కడప రమణారెడ్డి, ప్రభుత్వ వైద్యుడు



సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్కనే సప్లయ్ ఛానల్‌లో పేరుకుపోయిన చెత్త



మార్కాపురం తూర్పువీధిలో ఇదీ పరిస్థితి

అబ్బో.. గబ్బు!

- మార్కాపురంతోపాటు గ్రామాల్లో దారుణంగా పారిశుధ్యం
- ప్రజలపై దండయాత్ర చేస్తున్న దోమలు
- ఆస్పత్రుల పాలై ఆర్థికంగా చితికిపోతున్న జనం

మార్కాపురం:

దోమలపై దండయాత్ర చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ప్రకటన నోటి మాటకే పరిమితమైంది. ప్రతి మంగళవారం వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం బ్లీచ్ పౌడర్ కొనేందుకు కూడా డబ్బులు లేవంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిందారోపణలు చేయడానికే మొగ్గు చూపుతోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కే నాటికే రాష్ట్ర ఖజానాలో రూ.7 వేల కోట్ల నిధులున్నా గత రెండున్నర నెలలుగా గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపిన దాఖలాల్లేవు. కూటమి మంత్రులు, ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగా అరుస్తున్న బీద అరుపులు రోగాలపాలై ఆస్పత్రుల్లో ఉన్న ప్రజలను మరింత ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి.

పడకేసిన పారిశుధ్యం

మార్కాపురం పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్కన చెరువు సప్లయ్ ఛానల్, జీజీహెచ్‌కు దగ్గరగా ఉన్న గుండ్లకమ్మ ప్రాంతం, జీజీహెచ్ ప్రాంగణం, తూర్పువీధిలోని ఇరిగేషన్ చానల్ దోమల వృద్ధికి అనుకూలంగా మారాయి. చీకటి పడుతుందంటే చాలు రయ్.. మంటూ బయటకు వస్తున్న దోమలు ప్రజల రక్తం పీల్చేస్తున్నాయి. నియోజకవర్గంలోని తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి పట్టణాలతో



తర్లుపాడు మెయిన్‌రోడ్డులో అధ్వానంగా పారిశుధ్యం

పాటు గ్రామాల్లోనూ దోమల బెడద అధికంగా ఉంది. మార్కాపురం పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు ఇటీవల రూ.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. జేసీబీ లాంటి యంత్రాలతో మురుగు కాలువల్లో పూడిక తీయించాల్సి ఉండగా పారిశుధ్య కార్మికులతో తూతూ మంత్రంగా చేయించి మమ అనిపించారు.

దారుణంగా సప్లయ్ ఛానల్

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కాపురం చెరువు సప్లయ్ ఛానల్‌ను సుమారు 5 లక్షల రూపాయలతో బాగుచేయించారు. ఇరువైపులా మెస్ పెట్టించి కాలువలో చెత్తా చెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో మెయింటెనెన్స్‌ను పట్టించుకోకపోవడంతో సప్లయ్ ఛానల్ మళ్లీ యథాస్థితికి వచ్చింది. దీంతో సప్లయ్ ఛానల్‌కు ఇరువైపులా నివసించే ఏబీఎం పాలెం, కొండేపల్లి



పొదిలి నేతపాలెంలో మురుగుమయంగా ఉన్న వీధులు

రోడ్డు ప్రజలు దోమలదాడికి బెంబేలెత్తుతున్నారు. పదుల సంఖ్యలో ప్రజలు, చిన్నారులు జ్వరాలతో బాధపడుతున్నారు. మార్కాపురం పట్టణంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలన్న విషయమే మున్సిపల్ అధికారులు మరిచిపోయారు.



కంకి దశలో ఉన్న సజ్జ

పంట కోసం పాట్లు!



పంట పొలాల్లో కోతుల గుంపు, కాకులను బెదిరిస్తూ చప్పుడు చేస్తున్న రైతు

కొనకనమిట్ల: ఆరుగాలం శ్రమించి, కష్టపడి పండించిన పంటను కాపడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్న పందులు, కోతులను బెదరగొట్టేందుకు రైతులు చేయని ప్రయత్నమంటూ లేదు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పంట చేల వద్ద కాపలా ఉంటూ, రాత్రిళ్లు మంచెల వద్ద జాగారం ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

రోడ్డు ఆక్రమణతో రాకపోకలకు అవస్థలు



రోడ్డుకు అడ్డంగా వేసిన చిల్లకంప

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని భైరవకొండ వెళ్లే రోడ్డును ఆక్రమించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సర్వే నంబర్లు 1007, 1009, 1149 నుంచి రాకపోకలు సాగించేందుకు పూర్వం నుంచి రోడ్డు విడగొట్టబడింది. చీమలేటిపల్లెకు చెందిన కొందరు రైతులు ప్రస్తుతం ఆక్రమించి చిల్లకంప వేశారు. ఇదే రోడ్డు మీదుగా బూరుగచెరువు, దొనకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు వెంట వెళ్తుంటే నానా బూతులు తిడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాగే సమస్య తలెత్తితే రెవెన్యూ అధికారులు రోడ్డును విడగొట్టి హద్దులు వేశారు. ప్రస్తుతం మళ్లీ సమస్య సృష్టించారని, రెవెన్యూ అధికారులకు సమస్యపై అర్జీ ఇచ్చినప్పటికీ కాలయాపన చేస్తున్నారు గానీ.. సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మతల్లి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

దొనకొండ: మండలంలోని దేశిరెడ్డిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లోని ప్రజలు పోలేరమ్మ తల్లికి ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. ఏటా శ్రావణ మాసంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. మా ఊరును చల్లగా చూడమ్మా, పాడి పంటలు సమృద్ధిగా పండాలి, పిల్లా పాపలు సంతోషంగా ఉండాలి, సంవృద్ధిగా వర్షాలు పడాలంటూ మొక్కుకుంటారు. స్త్రీలు తలంటి స్నానాలు చేసి అమ్మవారికి నైవేద్యాలు చేసి సమర్పించారు. యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.

బీసీల అభ్యున్నతికి బీపీ మండల్ కృషి



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఎల్‌పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: బీసీల ఆరాధ్యదైవం, రిజర్వేషన్ పితామహుడు బీహార్ మాజీ సీఎం బిందేశ్వరీ ప్రసాద్ బీసీల అభ్యున్నతికి విశేష కృషి చేశాడని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ సిఫార్సుల్లో 40 అంశాలకుగాను కేవలం ఒకే ఒక్క అంశాన్ని అమలు చేస్తున్నందున బీసీలు నష్టపోతున్నారని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బీసీ సంఘానికి నూతన అధ్యక్షులుగా నల్లబోతుల అచ్చయ్య, వాల్మీకుల అధ్యక్షుడిగా గోసు సుబ్బారావుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆరు పురుషోత్తమ్, కోశాధికారిగా టీపీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కె.అబ్రహాం రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా జింకా నరసింహారావు, ఉప కోశాధికారిగా గొట్టిపాటి శ్రీను, కమిటీ సభ్యులుగా నాగార్జునగౌడ్, ఆర్ రామారావు, శ్రీనివాస్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపుదల

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కిశోర్‌కుమార్



విద్యార్థులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్ తదితరులు

మార్కాపురం: కరాటే విద్యతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్టులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రౌన్ బెల్ట్ నుంచి బ్లాక్‌బెల్ట్‌కు ప్రమోటైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్కే జోయాసిద్ధికి, ఎస్కే యాసిన్‌బాషా, ఎస్కే షాకీర్ బాషా, జేకేఎస్‌సీ భార్గవ్, ఎం.తేజ వర్ధన్, ఎస్.చరణ్‌కుమార్, జె.వెంకట హరి బ్లాక్‌బెల్టుకు ప్రమోటయ్యారు. కార్యక్రమంలో కరాటే చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



కంభంలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నరసింహారావు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రవీంద్రారెడ్డి

కంభం: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కంభం ఎస్సై బి.నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బస్టాండులో ప్రయాణికులు, ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు కలగకుండా ఆటోలు నిలుపుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో అనుమానాస్పద వ్యక్తులు ఎక్కితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉంచుకుని యూనిఫాం ధరించి ఆటోలు నడపాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...

బేస్తవారిపేట: వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జంక్షన్‌లో ఒంగోలు–నంద్యాల హైవేపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయవద్దని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని హెచ్చరించారు.

నేటి నుంచి పోలేరమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవాలు



సిద్ధవరంలో ముస్తాబవుతున్న పోలేరమ్మ తల్లి ఆలయం



కాట్రగుంట పెద్దమ్మతల్లి మూలవిరాట్

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజు స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠాచార్యులు పోతులూరి శివరమాచార్యస్వామి ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు, మంగళ, బుధవారాల్లో గ్రామోత్సవం, విగ్రహచ కళశ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కాట్రగుంట గ్రామంలో సోమ, మంగళవారాల్లో పెద్దమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం హోమాలు, గ్రామోత్సవం, మంగళవారం కుంకుమ బండ్ల ఉత్సవం, బోనాల సమర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణాష్టమి సందర్భంగా గోపూజ మహోత్సవం



గోపూజ మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ మహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, అంకురార్పణ, విష్ణు సహస్రనామ పఠనం నిర్వహించారు. 26వ తేదీ స్వామివారి కల్యాణ మహోత్సవం, భక్తులకు అన్నదానం, గ్రామోత్సవం, కోలాట ప్రదర్శన, 27వ తేదీ సుదర్శన హోమం, సుప్రభాతసేవ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ వెంకటయ్యయాదవ్, సభ్యులు మొర్రిపిచ్చయ్యయాదవ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.